క్లుప్తంగా

15న చెట్ల ఫలసాయానికి కౌలు వేలం

కపిలేశ్వరపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని 33 కొబ్బరి, మూడు మామిడి చెట్ల ఫలసాయాన్ని మూడేళ్ల పాటు పొందేందుకు ఈ నెల 15న బహిరంగ కౌలు హక్కు వేలం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి డిసెంబర్ 31, 2026 వరకూ ఫలసాయం పొందేందుకు ఈ నెల 15వ తేదీ ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద వేలం నిర్వహిస్తామన్నారు. గతంలో రూ.75 వేలకు హెచ్చుపాటగా ఖరారైందని, ఈ విడత పాటలో పాల్గొనే వారు రూ.3 వేల ధరావత్తు చెల్లించాలన్నారు.

కరాటేలో సత్తా చాటిన ద్వారపూడి విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన ద్వారపూడి హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం (మండపేట): ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి కుంగ్ ఫూ, కరాటే పోటీల్లో మండపేట మండలం ద్వారపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జూనియర్ బాలికల ఎల్లో బెల్ట్ విభాగంలో వన్నూరి హేమలత, సీనియర్ బాలికల ఎల్లో బెల్ట్ విభాగంలో వన్నూరి పావని, జూనియర్ బాలుర ఎల్లో బెల్ట్ విభాగంలో బర్ల శ్రీనివాస్, గ్రీన్ బెల్ట్ విభాగంలో బొడ్డు అఖిల్ విజేతలుగా నిలిచారు. అలాగే వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో అనపర్తిలో మండపేట మండల స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఆచంట దుర్గాప్రసాద్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు.

ఇద్దరికి పృథ్వీరాజ్ పరామర్శ

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అడబాల శ్రీనివాస్, అబ్బిరెడ్డి గంగాధర్‌లు శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. వారిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ మంగళవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ సభ్యుడు మేడిశెట్టి దుర్గారావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, నాయకులు పెద్దింశెట్టి రామస్వామి, సంచాబత్తుల చిన్నా, ఉప్పులూరి రామకృష్ణ, షేక్ రెహామ్రాన్ ఉన్నారు.


హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ప్రమాదకరంగా ఉన్న వంతెన

కె.గంగవరం: అసలే ఏటిగట్టు ఇరుకుగా ఉంటుంది దీనిపై ఉన్న వంతెన మరీ ఇరుకు. దీనికి తోడు వంతెనకు ఇరువైపులా ప్రమాదకర మలుపులతో ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు అంటున్నారు. మండలంలోని కోటిపల్లి–కోట ఏటిగట్టుపై ఉన్న ఈ వంతెన వద్ద గత రెండు నెలల కాలంలో పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యారని స్థానికులు చెబుతున్నారు. కనీసం ఈ వంతెన వద్ద ఆర్అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా స్పీడుబ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీల సమ్మె



మండపేటలో సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

కపిలేశ్వరపురం: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు మండపేట నియోజకవర్గంలోని కపిలేశ్వరపురం, మండపేట, రాయవరం మండలాల అంగన్‌వాడీలు మంగళవారం సమ్మెకు దిగారు. మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మూడు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు. యూనియన్ నాయకురాలు కె.కృష్ణవేణి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కంటే ఎక్కువ స్థాయిలో వేతనాలను ఇవ్వాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించి చట్ట పరిధిలో పీఎఫ్, గ్రాడ్యుటీ వంటి ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షురాలు ఎం.బేబి. వర్కింగ్ ప్రెసిడెంట్ బి.ఆదిలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాణి, అనంత్, పి.జానికీ దేవి, ఎం.మంగాదేవి, దుర్గ, ఎం.సూర్యకుమారి, వజ్రం, సత్యవేణి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలకు మోక్షం

- రూ.5.50 కోట్లతో డ్రైన్లు, రోడ్ల అభివృద్ధి
- రూ.45 కోట్ల పనులకు ప్రణాళికలు
- రూ.12 కోట్లతో సీ వేజ్ వాటర్ ప్లాంట్



రామచంద్రపురంలోని మూడో వార్డు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్మిస్తున్న మేజర్ డ్రైన్

రామచంద్రపురం: ఒకప్పుడు ఆ రోడ్డులో వెళ్లాలంటేనే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితులు. వర్షం చుక్క పడిందంటే చాలు రోడ్లన్నీ జలమయం. డ్రైన్లు పొంగి ప్రవహిస్తుంటాయి. ఒక ప్రణాళిక బద్ధమైన నిర్మాణాలు చేయకపోవటంతో మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైన్ల పరిస్థితి దారుణంగా మారింది. గత పాలకవర్గం సమయంలో జరిగిన డ్రైన్లు, రోడ్లు అస్తవ్యస్థ నిర్మాణాలతో ప్రజలు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రస్తుత పాలక వర్గం నడుం బిగించింది.

14, 15 ఆర్థిక సంఘం నిధులతో నిర్మాణం

పురపాలక పరిధిలో 28 వార్డులున్నాయి. సుమారుగా 45 కిలోమీటర్ల మేర పట్టణం విస్తరించింది. సుమారుగా 50 వేల మందికి పైగా జనాభా కలిగిన పట్టణంలో 17,550 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. నియోజకవర్గానికి పట్టణ కేంద్రం కావటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ఉద్యోగ వ్యాపార రీత్యా పట్టణానికి తరలిరావటంతో పట్టణ విస్తీర్ణం గత అయిదారేళ్లుగా పెరుగుతూ వచ్చింది. దీంతో పట్టణ చుట్టుపక్కల లేవుట్‌లు పెరుగుతూ వచ్చాయి. దీంతో పంట పొలాలు ఇళ్ల స్థలాలుగా మారిపోయి, కాలువలు మూసుకుపోయాయి. పట్టణం నుంచి వచ్చే మురుగునీరు దిగేందుకు మార్గాలు లేకుండా పోయాయి. గత అయిదారేళ్లుగా పట్టణ విస్తీర్ణం పెరగటం వేగవంతం అయినా దానికి తగ్గ మౌలిక సదుపాయాల కల్పన మాత్రం జరగలేదు. ప్రణాళిక బద్ధమైన రోడ్లు, డ్రైనేలు లేకపోవటంతో వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి. దీంతో పాటుగా మురుగు కాలువలకు అవుట్‌లెట్లు సైతం లేకపోవటంతో డ్రైన్లలోని మురుగునీరు రోడ్ల మీదకు సైతం ప్రవహిస్తున్నాయి. ప్రధానంగా పట్టణంలోని ప్రధాన రహదారిలోని డ్రైన్‌తో పాటుగా బ్రాడీపేట నుంచి తోటవారి వీధి ద్రాక్షారామ రోడ్డులోని మేజర్ డ్రైన్‌లు, బ్రాడీపేట, స్టిల్‌విల్‌పేట, రాజబాబునగర్, శాంతినగర్, జల్లివారిపేట, శీలంవారిసావరం, చర్చి కాంపౌండ్, సూర్యనగర్, గుబ్బవారిపేట, అంకంవారివీధి, పిల్లావారివీధి, రాజు మాస్టారువీధి తదితర ప్రాంతాల్లో డ్రైన్లు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్న పరిస్థితి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపాలిటీలోని 14 ఫైనాన్స్ నిధులు రూ.4.50 కోట్లతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టారు. అలాగే 15వ ఫైనాన్స్ నిధుల నుంచి రూ.కోటితో డ్రైన్లు నిర్మించారు. మొత్తంగా అత్యంత దుర్భరంగా ఉండే ప్రాంతాలల్లో ఈ డ్రైన్ల నిర్మాణంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమయింది.

రూ.45 కోట్ల ప్రత్యేక నిధులతో అభివృద్ధి

పూర్తి స్థాయిలో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణాలకుగాను ప్రత్యేక నిధులు రూ.45 కోట్లతో అభివృద్ధి పనులకు మున్సిపాలిటీ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే రూ.20 కోట్లు, డ్రైనేజీల నిర్మాణాలకు రూ.15 కోట్లు మంజూరు కావటంతో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించారు,. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కానున్నాయి.

పట్టణంలో సీవేజ్ వాటర్ ప్లాంట్

మంత్రి వేణుగోపాలకృష్ణ చొరవతో పట్టణంలో సీవేజ్ వాటర్‌ప్లాంట్‌ను రూ.12 కోట్లతో చేపట్టనున్నారు. ఇప్పటికే దానికి సంబంధించి భూ సేకరణ చేశారు. దీని ద్వారా పట్టణంలోని డ్రైనేజీల నుంచి వెలువడే మురుగునీటిని సీవేజ్ వాటర్ ప్లాంట్ ద్వారా శుద్ధి చేసి పట్టణ సమీప గ్రామాల పంట పొలాలకు శుద్ధి చేసిన నీటిని తరలించనున్నారు.

డ్రైన్లు, రోడ్ల నిర్మాణాలు



రూ 45 కోట్లతో నిర్మించే డ్రైన్లు, రోడ్లను ప్రణాళికలు తయారు చేసి కొన్ని పూర్తి చేయటం జరిగింది. ఇప్పటికే 14, 15 ఫైనాన్స్ నిధుల నుంచి అత్యవరసర పనులను పూర్తి చేయటం జరిగింది. పైప్‌లైన్ నిర్మాణాలు కూడా పూర్తి చేస్తున్నాము. మిగిలిన పనులను కూడా టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించటం జరుగుతుంది.

– టి.శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి



ప్రణాళికా బద్ధంగా మున్సిపాలటీ అభివృద్ధికి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర మంత్రి వేణుగోపాల కృష్ణ సూచనల మేరకు పట్టణాన్ని సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టడం జరుగుతుంది.

– గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్

అగస్త్యేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

రామచంద్రపురం: పట్టణంలో వేంచేసిన బాలాత్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. కార్తికమాసం చివరి రోజు అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామికి ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండప ఆరాధన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామికి అన్నాభిషేకం చేశారు. అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి స్వామికి శాంతి కల్యాణం జ్యోతిర్లింగార్చన, అభిషేకం చేసిన అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా అందజేశారు. భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కేవీఆర్ హాస్పిటల్ అధినేత కోట వెంకటరమణమూర్తి, వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో చెరుకుపల్లి గణేష్‌శర్మ బ్రహ్మత్వంలో అర్చకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రోత్సాహానికే ఆడుదాం ఆంధ్ర



క్రీడా సామగ్రి కిట్లు అందజేస్తున్న మంత్రి వేణు



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంపీపీ భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి తదితరులు

రామచంద్రపురం రూరల్: గ్రామాల్లోని యువతీ యువకులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అంబటి భవాని ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కిట్ల పంపిణీలో మంత్రి వేణు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదం చేస్తాయన్నారు. ప్రతి గ్రామంలోనూ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులకు మంత్రి వేణు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల చేతుల మీదుగా క్రీడా సామగ్రి కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎం.రాజు, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె విజయవంతం



ప్రధాన తపాలా కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న ఉద్యోగులు

రామచంద్రపురం: అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం దేశవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా రామచంద్రపురం బ్రాంచ్ పరిధిలోని గ్రామీణ తపాలా ఉద్యోగులంతా సమ్మెలో పాల్గొన్నారు. సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, ఎనిమిది గంటల పని విధానం ఉండాలని 12 ,24, 36 సర్వీస్ గల ఉద్యోగులకు అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్సును ఐదు లక్షలకు పెంచాలని, మెడికల్ సౌకర్యం, 180 రోజుల సెలవులను నగదుగా మార్చుకునే సౌకర్యం వెంటనే ఇవ్వాలని కోరుతూ స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఉద్యోగులంతా నినాదాలు చేశారు. ఉద్యోగులు ఏర్పాటు చేసిన ధర్నా శిబిరాన్ని పట్టణ ఏఐటీయూసీ అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరావు, సీపీఐ ఏరియా కార్యదర్శి పెద్దిరెడ్డి రాములు ప్రారంభించారు. ఏఐటీయూసీ నాయకులు వి.గోపాలరావు మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు వై.స్వర్ణన్ రాజు, ఎస్వీ విశేశ్వరరావు, వై.కామేశ్వరి, జి.రామకృష్ణ, వి.వీరయ్య చౌదరి, జి.రామకృష్ణ చౌదరి, పి.గణేష్‌కుమార్ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. బ్రాంచి పరిధిలోని 170 మంది ఉద్యోగులకు గాను 150 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారని నాయకులు తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామచంద్రపురం: పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం డిపో గేటు మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. రీజినల్ వైస్ ప్రెసిడెంట్ జీడీవీపీ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ గేట్ మీటింగ్‌లో డిపో సెక్రటరీ ఏఎస్ వాసు, జాయింట్ సెక్రటరీ డి.కుమారి, కోశాధికారి సీహెచ్‌వీ రావు, సభ్యులు వీరబాబు, భాస్కర్, రాఘవేంద్ర, కార్మికులు పాల్గొని నినాదాలు చేశారు. కుమార్ మాట్లాడుతూ ఆర్‌పీఎస్ 2017 ఏరియర్స్ చెల్లించాలని, ఈపీఎఫ్ 95 హయ్యర్ పింఛన్ పొందేందుకు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ నుంచి మినహాయింపులు ఇచ్చి పరిమితి వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. రిటైర్డు ఉద్యోగులకు సెటిల్‌మెంట్ చేసి ఆర్థికంగా ఆదుకోవాలని, ఉద్యోగుల గ్రాట్యుటీ సెలవుల ఎన్‌క్యాష్‌మెంట్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఈనెల 27 నుంచి సమ్మెను జయప్రదం చేయండి

రామచంద్రపురం: మునిసిపల్ కార్మికుల దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి నిర్వహించే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.సత్తిబాబు, ఏఐటీయూసీ పట్టణ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెద్దిరెడ్డి రాములు పిలుపునిచ్చారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం యూనియన్ అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరావు అధ్యక్షతన పట్టణంలోని చెలికాని రామారావు స్మారక భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సత్తిబాబు పాల్గొని ప్రసంగించారు. ఈనెల 18, 19, 20 మూడు రోజులు గేట్ మీటింగ్స్ పెట్టి సమ్మెలో డిమాండ్లను వివరించాలని తెలిపారు. జిల్లా కరపత్రం వేసి పంపిణీ చేయాలని, అనంతరం 23వ తేదీ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి మునిసిపాలిటీలో అన్ని వర్గాల కార్మికులకు పూర్తి స్థాయి సమీకరణ చేయాలన్నారు. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమమిళ్ల సుబ్బరాయుడు హాజరు కానున్నారని సత్తిబాబు వెల్లడించారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల బాబీ, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి గౌరిపర్తి రాజు, బుంగా లక్ష్మణ్, భార్గవరాజు, కంకిపాటి నాగబాబు, అమలదాసు మాచరయ్య, సంపర సుధ, మందపల్లి అన్నవరం పాల్గొన్నారు.

శ్రీవారికి పీఠంలో తిరుమంజన సేవ

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామికి, పీఠంలో కొలువైన విజయదుర్గా అమ్మవారికి తిరుమంజన సేవ ఘనంగా నిర్వహించారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధానా ర్చకుడు వేణుగోపాల దీక్షితుల నేతృత్వంలో తిరు మంజన సేవ చేశారు. వేణుగోపాల దీక్షితులు వేంకటేశ్వరస్వామి విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం తిరుపతికి చెందిన వేద పండితుల ఆధ్వర్యంలో విజయదుర్గాదేవికి, వేంకటేశ్వరస్వామికి, అమ్మవార్లకు వివిధ రకాల ద్రవ్యాలతో తిరు మంజనం, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి), విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, పెదపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు చిరునామా జగన్



తాళ్లపోడులో సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగమణి, అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్



రాయవరం మండలం సోమేశ్వరంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



ఏడిదలో సంక్షేమ వివరాల సమాచార పట్టికను ఆవిష్కరిస్తున్న నాయకులు

కె.గంగవరం: రాష్ట్రంలో సంక్షేమ పాలనకు చిరునామాగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఎంపీపీ పంపన నాగమణి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తాళ్లపోడు గ్రామంలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సభలో వారు మాట్లాడుతూ మనకు మంచి చేస్తున్న జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకునే బాధ్యత మనందరిపైనా ఉందని వివరించారు. టీడీపీ, జనసేన పార్టీల మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సీఎం జగన్ ప్రజలకు సంక్షేమ పాలన నూటికి నూరు శాతం అందించారని చెప్పారు. పేదల అభివృద్ధికి కృషి చేసిన జగన్‌ను మళ్లీ రాష్ట్రానికి కావాలని సూచించారు. అనంతరం సచివాలయం వద్ద గ్రామంలో ప్రజలు పొందిన సంక్షేమ లబ్ధి వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. సర్పంచ్ చప్పిడి శ్రీనివాసు, ఎంపీటీసీ కోట రామకృష్ణ, కన్వీనర్లు బచ్చల చిరంజీవి, పిల్లి పరదేశి, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు, ఈఓపీఆర్డీ నాగేంద్ర, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాయవరం: రాష్ట్రంలో సంక్షేమ పాలనకు చిరునామాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారులు అన్నారు. సోమేశ్వరంలో సర్పంచ్ ఆరిఫ్ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలో ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల కర పత్రాలను ప్రజలకు అందజేశారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలతో కూడిన డిజిటల్ బోర్డును, పార్టీ పతాకాన్ని వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల అప్పారావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కోట వెంకట్రావు, ఎంఎల్‌వో రాజేష్, మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, అధిక సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (మండపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు మేలు కలుగుతోందని మండపేట మండలం ఏడిదలో మంగళవారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. గ్రామంలోని 3వ సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పేదలకు అందించిన సంక్షేమ వివరాల బోర్డును ప్రదర్శించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కురుపూడి భవాని, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పలివెల సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఏఎంసీ డైరెక్టర్ ముగ్గుల పార్థసారథి తమ ప్రసంగాల్లో జగన్ పాలనలో ఏడిద గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. వార్డు సభ్యులు వాసిరెడ్డి అర్జున్, బండారు కృష్ణ, నాయకులు బేత వెంకటేశ్వరరావు, పమిడిపల్లి నానాజీ, ముసలయ్య పాల్గొన్నారు.

కుష్టు లక్షణాలను తొలి దశలోనే గుర్తించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీపీఎంఓ వెంకటేశ్వరరావు

కపిలేశ్వరపురం: కుష్టు వ్యాధి లక్షణాలను తొలి దశలోనే గుర్తించాలని డీపీఎంఓ పోతుల వెంకటేశ్వరరావు అన్నారు. అంగర పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాల విద్యార్థులకు కుష్టు వ్యాధి లక్షణాలపై మంగళవారం అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీపీఎంఓ వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ. జుత్తుక మల్లికార్జునుడు, నోడల్ అధికారి వెన్నేటి వెంకటేశ్వరరావు వ్యాధి వ్యాప్తిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లక్షణాలు కనిపిస్తే పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలని సూచించారు. వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


వల్లూరులో దీపాలంకరణ



వల్లూరులో దీపాలంకరణ దృశ్యం

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం దీపోత్సవం నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రాంగణంలో ప్రమిదలతో దీపాలను వెలిగించారు. గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలతో ఐక్యత



మండపేటలో క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం (మండపేట): క్రిస్మస్ వేడుకలు ఐక్యతను నెలకొల్పుతాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని డేనియల్ పాల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జిల్లా పాస్టర్ ఫెలోషిప్ క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే వేగుళ్ళ హాజరయ్యారు. క్రైస్తవ ప్రబోధకులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ ఐక్యతకు ప్రతీక అన్నారు. అనంతరం పెంతెకోస్తు క్రైస్తవ మహాసభలు పోస్టరు ఆవిష్కరించారు.

ఇది పార్టీలో ఐక్యతకు గుర్తు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వన సమారాధనను సక్సెస్ చేసిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు



మండపేటలో అభిమానులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ కార్తిక వన సమారాధనను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని అభిమానులు చూపిన ఐక్యత తనకు ముచ్చటేసిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గొల్లపుంత రోడ్డులో ఆదివారం నిర్వహించిన వన సమారాధనకు వేదిక, వంటకాలు, వడ్డన తదితర వంటి బాధ్యతలు విజయవంతంగా నిర్వహించిన తన అభిమానులు, వైఎస్సార్ సీపీ శ్రేణులను ఎమ్మెల్సీ తోట అభినందించారు. వారందరితో మంగళవారం పట్టణంలో ఆయన సమావేశమై కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ 60 వేల మందికి సకాలంలో సేవలందించడం గొప్ప విషయం అన్నారు. వన సమారాధన విజయవంతం పార్టీ శ్రేణుల్లో ఐక్యతను తెలియజేస్తోందన్నారు. ఇదే వరవడిని రానున్న ఎన్నికల్లో సైతం చూపాలని ఆకాంక్షించారు. పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ కాళ్ళకూరి నాగబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేష్, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, కౌన్సిలర్లు గ్రంధి శ్రీను, పోతంశెట్టి ప్రసాద్, ముక్కా సుబ్రహ్మణ్యం, దాలియ్య పాల్గొన్నారు.

ఉల్లాసంగా కార్తిక వనసమారాధన



బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని సత్కరించిన న్యాయవాదులు

రామచంద్రపురం: స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టౌన్ హాల్‌లో మంగళవారం కార్తిక వన సమారాధన ఉల్లాసంగా నిర్వహించారు. తొలుత బార్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, వాడ్రేవు సాయి ప్రసాద్‌లు కార్తిక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ హాజరయ్యారు. కార్యవర్గం సభ్యులు సీనియర్ న్యాయవాదులను, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులను దుశ్శాలువా కప్పి, పూల మాలలు వేసి సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డీఎస్ఎస్ శర్మ, పలివెల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ చిన్నం వీరెడ్డి, కోశాధికారి చక్రవర్తి, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వీ, మహిళా న్యాయవాదుల ప్రతినిధి కేవీ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య ఆయుధం ఓటు



రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న రాజేశ్వరరావు

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజాస్వామ్య ఆయుధం ఓటు అని, ఆ హక్కును ప్రతి ఒక్కరికీ అందించేందుకు సమైక్యంగా కృషి చేయాలని మండపేట తహసీల్దార్, సహాయ ఓటరు నమోదు అధికారి టీఆర్ రాజేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ స్థాయిలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మండపేట పట్టణంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 2, 3 తేదీలలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలను తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పనిచేసే విధానంపై అవగాహన కల్పించారు. ఎన్నికల నిర్వహణలో సాంకేతిక అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన అనుమానాలను నివృత్తి చేశారు. సమావేశంలో రాయవరం, కపిలేశ్వరపురం తహసీల్దార్లు కొమరం సూర్యారావు, ఎనికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.